సాక్షి
కుమురం భీం
ఆదివారం । 16 । జూన్ । 2024

నాన్నకు ప్రేమతో..



వందమంది ఉపాధ్యాయులకు సమాన స్థాయి నాన్నది. నేడు ఫాదర్స్‌డే సందర్భంగా పిల్లల ఉన్నతికి తమ జీవితాలను ధారబోసిన పలువురు తండ్రులపై ప్రత్యేక కథనం.. 8లో▸



మానవ మృగాన్ని శిక్షించాలి

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని పలువురు కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0 /28.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జాబ్‌మేళాను యువత వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రముఖ కంపెనీల్లో పని చేసేందుకు ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో టాస్క్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సహకారంతో కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 50 ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులు, 50 యాస్ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ కలిగి, 28 ఏళ్లలోపువారు హాజరు కావాలని పేర్కొన్నారు. వేతనం రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19న ఉదయం 11గంటలకు జరిగే జాబ్ మేళాకు విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9908187894, 9440514962 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమన్వయంతో పని చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న యువరాజు

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో పోలీస్ అధికారులు, జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి యువరాజు సూచించారు. బాధితులకు వివిధ కేసులకు సంబంధించి అందజేసే పరిహారంపై పోలీస్ అధికారులు, జిల్లా సంక్షేమశాఖ అధికారులతో శనివారం కోర్టు హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం అందేలా చూడాలని సూచించారు. మహిళలకు పరిహారం అందించడంలో జాప్యం చేయొద్దని తెలిపారు. డీఈవో అశోక్, ఎస్సై రాజేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశానికి హాజరు కావాలి

రెబ్బెన: సింగరేణి సంస్థలో పని చేసి 2017 జనవరి 1 నుంచి 2018 ఫిబ్రవరి 28 తేదీ మధ్య కాలంలో రిటైర్డయిన కార్మికులు గ్రాట్యూటీ కోసం ఆదివారం సీసీసీలోని నర్సయ్య భవన్ (ఏఐటీయూసీ) కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వేజ్‌బోర్డు శాశ్వత సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని రిటైర్డ్ కార్మికులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మెరుగైన సేవలందించాలి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచించారు. శనివారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ డిపో పరిధిలో హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలు, గ్రామాలకు నడుస్తున్న బస్సుల్లో ప్రయాణించే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఏడీసీ బాబురావ్ ఉన్నారు.

వినతిపత్రం అందజేత



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: వాంకిడి మండలంలో ఎస్సీ ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో పోస్టు మెట్రిక్ కళాశాల ప్రారంభించాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి సజీవన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. మండలంలో తెలంగాణ మోడల్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉందని, సుమారు 500 మంది విద్యార్థులు దూరప్రాంతాల నుంచి వస్తూ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ ఉన్నారు.

జలపాతాలపై పక్షపాతం!

- వసతులు లేక సందర్శకుల పాట్లు
- ఏటా పెరుగుతున్న పర్యాటకులు
- రవాణా సౌకర్యంపై పట్టింపేది?
- హామీలు విస్మరిస్తున్న అధికారులు



గుండాల జలపాతం వద్ద పరిశీలిస్తున్న అప్పటి ఐటీడీఏ పీవో భవేశ్‌కుమార్, ఎఫ్‌డీవో శాంతారాం (ఫైల్)

తిర్యాణి: వానాకాలం వచ్చిందంటే చాలు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలు పచ్చదనాన్ని పరుచుకుంటాయి. దట్టమైన అడవుల మధ్య ఉండే ఆదివాసీ గూడేలు, ఎత్తైన కొండలు చూపరులకు కనువిందు చేస్తాయి. ఇవే కాకుండా జిల్లాలోని జలపాతాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. వానాకాలంలో జిల్లాలోని జలపాతాల వద్ద సందర్శకుల తాకిడి ఉంటోంది. కానీ.. ఇక్కడ కనీస వసతులు లేక సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు

తిర్యాణి మండలంలోని చింతలమాదర, గుండాల, లింగాపూర్ మండలం మిట్టె, ఆసిఫాబాద్ మండలం సప్త గుండాల జలపాతాలు ప్రధానమైనవి. ముఖ్యంగా చింతలమాదర జలపాతానికి జూలై మొదటి వారం నుంచి నవంబర్ వరకు నిత్యం అధికసంఖ్యలో ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్రలోని రాజురా, చంద్రపూర్ బల్లార్షా ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వీకెండ్‌లో పర్యాటకుల సంఖ్య రెట్టింపవుతుంది. అయితే ఫారెస్ట్, గ్రామస్తులతో కూడిన ఎకో టూరిజం కమిటీ (ఈటీసీ) ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. పర్యాటకుల నుంచి ఎంట్రీ ఫీజు, వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నారు. జలపాతం వద్ద ఉండే సిబ్బంది (గజ ఈతగాళ్లు) కి వేతనాలు ఇస్తున్నారు. దాదాపు 50 అడుగుల ఎత్తు నుంచి కిందికి నీళ్లు జాలువారుతూ ఎంతో అందంగా కనిపించే గుండాల జలపాతం (బాహుబలి) కూడా తిర్యాణి మండలంలోనే ఉంది. ఇక్కడ పర్యాటకుల సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. కానీ.. ఈ జలపాతం వద్దకు వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేదు. సుమారు ఆరు కిలోమీటర్లు కాలినడకన వెళ్తే గాని అక్కడికి చేరుకోలేం. దీంతో జలపాతాన్ని సందర్శించాలనుకునే చాలా మంది పర్యాటకుల కోరిక తీరడంలేదు.

అభివృద్ధి చేస్తే పెరగనున్న ఉపాధి

ఏజెన్సీ ప్రాంతాల్లోని జలపాతాలను అభివృద్ధి చేస్తే ప్రత్యక్షంగా 100 మంది వరకు, పరోక్షంగా మరి కొంత మందికి ఉపాధి లభించనుంది. ప్రస్తుతం చింతలమాదర జలపాతం ఎకో టూరిజం కమిటీ ద్వారా సీజన్‌లో దాదాపు 10మంది వరకు ఉపాధి పొందుతున్నారు. క్షేత్రస్థాయిలో జలపాతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగేందుకు అవకాశముంది. మరో నెల రోజుల్లో సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. దీంతో పాటు జలపాతానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కనువిందు చేస్తున్న గుండాల జలపాతం (ఫైల్)

వసతులు లేక పర్యాటకుల పాట్లు

జిల్లాలో ఎంతో అందమైన జలపాతాలున్నా వాటి అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. జలపాతాల వద్ద కనీస సౌకర్యాలు లేక సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పర్యాటకులు దుస్తులు మార్చుకునేందుకు గదులు, అత్యవసరానికి మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. విశ్రాంతి గదుల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. చింతలమాదర జలపాతం నిర్వాహకులు సందర్శకుల కోసం మౌలిక వసతులు కల్పించాలనే విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కాగా, ఎకో టూరిజం ద్వారా నిధులు మంజూరు చేసి వసతులు కల్పిస్తామని ఉన్నతాధికారులు జలపాతం సందర్శనకు వచ్చిన క్రమంలో పలుసార్లు హామీ ఇచ్చారు. కానీ.. నేటికీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టలేదు. దీంతో పాటు గుండాల జలపాతం వద్ద సుమారు రూ.20 లక్షల నిధులతో పర్యాటకులు విడిది చేసేందుకు వెదురు బొంగులతో ప్రత్యేక గుడారాలు, ట్రెక్కింగ్, సైక్లింగ్, ఆదివాసీల సంప్రదాయాలు, సాహస క్రీడలు, బోటింగ్ లాంటివి ఏర్పాటు చేస్తామని అప్పటి ఐటీడీఏ పీవో భవేశ్ మిశ్రా, డీఎఫ్‌వో శాంతారాం హామీ ఇవ్వగా, నేటికీ కార్యరూపం దాల్చలేదు.

వసతులు కల్పించాలి



చింతలమాదర జలపాతానికి ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, మహారాష్ట్ర నుంచి నిత్యం వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వారికి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం చొరవ చూపి జలపాతం అభివృద్ధికి సహకరించాలి.
– గోపాల్, చింతలమాదర జలపాతం ఈటీసీ చైర్మన్

అభివృద్ధికి కృషి చేయాలి



గుండాల (బాహుబలి) జలపాతం వద్ద వెదురుతో గూడారాలు, బోటింగ్ సదుపాయం, ఇతర అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు చేస్తామన్న అధికారులు పట్టించుకోలేదు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది. – మర్సుకోల అశోక్, గుండాల

మరమ్మతు పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగు రోజులవుతున్నాయని, పాఠశాలల్లో చేపట్టిన టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్, గదుల నిర్మాణంతో పాటు మరమ్మతు పనులు వేగవంతం చేయాలని సూచించారు. వానాకాలంలో పాఠశాల తరగతి గదుల్లో వర్షపు నీరు ఉరిస్తే గుర్తింపు పొందిన కంపెనీల నాణ్యమైన డాంబర్ షీట్లను పైన అతికించాలని తెలిపారు. పైకప్పు మరమ్మతు పనులు వారం రోజుల్లో పూర్తవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల ఎంబీ రికార్డులు పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, విద్యార్థులకు అందించని చోట త్వరగా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. పనుల పురోగతిపై విద్యాశాఖ అధికారులు, ఇంజినీర్లను మండలాలవారీగా అడిగి తెలుసుకుని సూచనలు, సలహాలిచ్చారు. గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లోనూ అమ్మ ఆదర్శ పనులు వెంటనే ప్రారంభించాలని, అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈవో అశోక్, జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి రమాదేవి, డీఆర్డీవో సురేందర్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

‘భగీరథ’ సర్వే త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రె
- మోతుగూడలో సర్వే పరిశీలన
- బురుగుడలో విత్తన దుకాణం తనిఖీ
- తుంపల్లి ప్రాథమిక పాఠశాల సందర్శన



మోతుగూడలో సిబ్బంది ద్వారా సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రె

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ సర్వే త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె ఆదేశించారు. శనివారం మండలంలోని మోతుగూడ గ్రామంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పర్యటించారు. ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ సురక్షితమైన మిషన్ భగీరథ నీరు అందించేందుకు సర్వే చేపడుతున్నామని తెలిపారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే వివరాలు యాప్‌లో నమోదు చేయాలని, తప్పులు దొర్లకుండా త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వానాకాలం వస్తున్నందున మురుగు కాలువలు శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలతో డెంగీ, మలేరియా వచ్చే అవకాశం ఉన్నందున దోమతెరలు వాడాలని తెలిపారు. కాచి వడబోసిన నీటినే తాగాలని సూచించారు. ఆయన వెంట డివిజనల్ పంచాయతీ అధికారి ఒమర్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ సహాయ ఇంజినీర్ శైలేందర్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

విత్తనాలను అధిక ధరలకు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, దుకాణాలను సీజ్ చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె హెచ్చరించారు. మండలంలోని బురుగుడ మెయిన్ రోడ్డుపై గల విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విత్తన డీలర్లు తమ లైసెన్స్, దుకాణం అనుమతి, నిల్వ, ధరల పట్టిక తదితర వివరాలు షాపు ఎదుట బోర్డుపై ఉంచాలని ఆదేశించారు. విత్తన రశీదులు, విత్తనాల ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యేదాకా భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సమన్వయం చేసుకుని జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టాలని ఆదేశించారు. వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావ్, వ్యవసాయ సహాయ సంచాలకుడు మిలింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె సూచించారు. మండలంలోని తుంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. వసతులు పరిశీలించారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బడిబాట కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. వానలు కురిసినప్పుడు పాఠశాల భవనం పైకప్పు ఉరుస్తూ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే స్పందించిన కలెక్టర్ డాంబర్ షీట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈవో అశోక్, డీఆర్డీవో సురేందర్, డీపీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని..

మృగశిర కార్తె ప్రవేశించి వారమైనా తొలకరి జాడ లేదు. జిల్లాలో పలుచోట్ల రైతులు వేసిన విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో దిగులు చెందిన రైతులు శనివారం వరుణుడి కరుణ కోసం పూజలు చేశారు. దహెగాం మండలం గిరివెల్లి గ్రామ వీధుల గుండా దేవతా విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు.



– దహెగాం

‘మధ్యాహ్న’ నిధులు విడుదల

- 987 స్కూళ్లకు ఎండీఎం నిధులు
- గౌరవ వేతనాలు కూడా మంజూరు
- ఆనందం వ్యక్తంజేస్తున్న కార్మికులు
- ధరలు పెంచాలని సర్కారుకు విజ్ఞప్తి



సంజీవనగర్ ఎంపీపీఎస్‌లో మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికులు

పెంచికల్‌పేట్: ఐదు నెలలుగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించిన కార్మికులకు ప్రభుత్వం ఎండీఎం నిధులతో పాటు గౌరవ వేతనాలు విడుదల చేసింది. దీంతో జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు బిల్లులు రాక ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారు. కాగా, ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను రెండురోజుల్లో అధికారులు ఆయా ప్రభుత్వ బడుల్లో విధులు నిర్వహిస్తున్న కుక్‌లు, హెల్పర్‌ల ఖాతాల్లో జమ చేయనున్నారు.

1,521 మంది కార్మికులు

జిల్లాలోని 987 ప్రభుత్వ పాఠశాల్లో 1,521 మంది మధ్యాహ్న భోజన కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌కు సంబంధించిన మధ్యాహ్న భోజన నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పటికప్పుడు కార్మికులకు గౌరవ వేతనాలతో పాటు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి జిల్లా విద్యాశాఖకు నిధులు మంజూరు కాకపోవడంతో ఫిబ్రవరి నుంచి కార్మికులు గౌరవ వేతనాలు, బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. వేసవి సెలవులు ముగిసి తిరిగి పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం గడిచిన విద్యాసంవత్సరం నిధులు విడుదల చేసింది. జిల్లాలో పనిచేస్తున్న 1,521 మంది కుక్‌లు, హెల్పర్ల వేతనాలతో పాటు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌కు సంబంధించిన మధ్యాహ్న భోజనం బిల్లుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.1,56,96,404 నిధులు విడుదల చేసింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు సంబంధించిన పూర్తి నిధులను విడుదల చేశారు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ధరలతో సతమతం

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించటానికి పెరిగిన ధరలతో కార్మికులు అవస్థలు పడుతున్నారు. నిత్యావసర ధరలతో పాటు మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరగగా ప్రభుత్వం అందిస్తున్న ధరలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రాథమిక తరగతుల (1–5) విద్యార్థులకు రూ.5.45, ప్రాథమికోన్నత (6–8) తరగతుల విద్యార్థులకు రూ.8.17 ఇస్తోంది. ధరలు పెరిగిన నేపథ్యంలో సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు వాపోతున్నారు.

నెలనెలా అందించాలి



మూడు నెలల బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐదు నెలలుగా అప్పు చేసి విద్యార్థులకు భోజనం అందించాం. పెరిగిన ధరలకు తోడు బిల్లులు సకాలంలో రాక అప్పులు చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ప్రతినెలా బిల్లులు సకాలంలో మా ఖాతాల్లో జమ చేయాలి. – కమల, ఎండీఎం కార్మికురాలు, ఎంపీపీఎస్ సంజీవనగర్

ధరలు పెంచాలి



ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన ధరలు సరిపోవడం లేదు. మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. అష్టకష్టాలు పడుతూ విద్యార్థులకు వండి పెడుతున్నాం. కార్మికులకు గౌరవ వేతనాలు పెంచడంతో పాటు భోజనాలకు చెల్లిస్తున్న ధరలను పెంచి ఆదుకోవాలి. – ఏ కమల, ఎండీఎం కార్మికురాలు, ఎంపీపీఎస్, పెంచికల్‌పేట్

త్వరలోనే ఖాతాల్లోకి..

ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన గౌరవ వేతనాలు, మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేసింది. జిల్లా కార్యాలయం నుంచి రెండు, మూడు రోజుల్లో కార్మికులకు గౌరవ వేతనాలతో పాటు మధ్యాహ్న భోజన బిల్లులను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం. – అశోక్, డీఈవో

బాలికను వేధించిన యువకుడు

- ప్రశ్నించిన తల్లిపై గొడ్డలితో దాడి
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

వాంకిడి: జిల్లాకు చెందిన బాలిక అత్యాచారం, హత్యకు గురై ఒకరోజు గడవకముందే మరో యువకుడు బాలికతో అసభ్యకరంగా వ్యవహరించాడు. ప్రశ్నించిన బాలిక తల్లిపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలు బాలికలు, చిన్నారుల రక్షణను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. వాంకిడి ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడికి చెందిన బాలిక శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఇదే గ్రామానికి చెందిన పవార్ నితిన్‌కుమార్ (22) మార్గమధ్యంలో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఇంటికి వెళ్లి విషయాన్ని తల్లికి చెప్పింది. కుటుంబ సభ్యులు ఆ యువకుడి ఇంటికి వెళ్లి విషయాన్ని అతడి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన యువకుడు బాలిక తల్లిపై వెనుక నుంచి గొడ్డలితో దాడి చేశాడు. దీంతో ఆమె తలపై తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

క్లుప్తంగా

పిడుగుపాటుతో ఎద్దు మృతి


ఎద్దు వద్ద బాధితుడు మల్లయ్య

తాండూర్: మండలంలోని వాల్మీకినగర్‌లో జంశెట్టి గట్టుమల్లయ్యకు చెందిన ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందింది. శనివారం కురిసిన భారీ వర్షానికి పిడుగుపడడంతో ఇంటివెనకాల పంటచేనులో కట్టేసిన ఎద్దు మృత్యువాత పడింది. 15 రోజుల క్రితమే రూ.70 వేలతో జత ఎద్లు కొనుగోలు చేశానని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. పశువైద్యాధికారి భూమయ్య మృతి చెందిన ఎద్దును పరిశీలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు


గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. తలకు బలమైన గాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. బాధితునికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే జైపూర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి


రమేశ్‌గౌడ్ (ఫైల్)

జైపూర్: ఈ నెల 9న తాటిచెట్టు పైనుంచి కిందపడిన మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన బొంగోని రమేశ్‌గౌడ్(56) చికిత్స పొందుతూ శని వారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య రజిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెరమెరి ఘాట్‌లో ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు గోలేటి నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న కారును ఉట్నూర్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో కారు డ్రైవర్‌తో పాటు మరో మహిళకు గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. క్షతగాత్రులను కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని కారు డ్రైవర్ సమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రమశిక్షణతో పెంచారు



మంచిర్యాల టౌన్: మాది వరంగల్ జిల్లా హుజూరాబాద్ సమీపంలోని పోతిరెడ్డిపేట. మా అమ్మా నాన్నలు భారతి, దేవేందర్‌రెడ్డి. మానాన్న సీకేఎం కాలేజీలో ల్యాబ్ డెమానిస్ట్రేటర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. మా అమ్మానాన్నల తండ్రులు ఉన్నత చదువులు చదివిన వారే కావడంతో నన్ను, మా తమ్ముడిని చిన్ననాటి నుంచి చదువుపైనే పూర్తి ధ్యాస పెట్టేలా చూసేవారు. ఏ చిన్న తప్పు జరిగినా శిక్షించి మరోసారి చేయకుండా క్రమశిక్షణతో పెంచారు. మా తమ్ముడు మహేశ్‌రెడ్డి ఇంజనీరింగ్ చేసి అమెరికాలో సెటిల్‌కాగా నేను డాక్టర్‌నయ్యాను. ఇప్పటికీ మా నాన్నను చూస్తే నాకు భయంతో కూడిన భక్తి ఉంది.

– డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

నాన్నే నా తొలి గురువు




పాతమంచిర్యాల: నా జీవితంలో మా నాన్నే నా తొలిగురువు. నా చిన్నతనంలోనే మా అమ్మ చంద్రకళ చనిపోవడంతో నాన్న కనపర్తి జానకిరాములు అన్నీ తానై నన్ను ఉన్నతస్థితికి తీసుకొచ్చారు. ఉద్యోగ రీత్యా కళాశాల లెక్చరర్ అయినా నాచదువు విషయంలో చాలా శ్రద్ధచూపేవారు. ఆయన నేర్పిన క్రమశిక్షణ, నడవడిక వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను. నా మొదటి గురువు మానాన్నేనని గర్వంగా చెప్పుకుంటా.

– కే.విశ్వేశ్వర్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి, మంచిర్యాల

Happy Father's Day

నాన్నకు ప్రేమతో..



- జన్మనిచ్చేది అమ్మ... • జీవితాన్నిచ్చేది నాన్న..
- పిల్లల కోసం సంతోషాలు త్యాగం..
- బతుకుదారి చూపుతున్న తండ్రులు • నేడు ఫాదర్స్‌డే..

ప్రపంచంలో అందమైన పదం అమ్మ... మధురమైన పిలుపు నాన్న.. అమ్మ జన్మనిస్తుంది. నాన్న జీవితాన్ని ఇస్తాడు. అమ్మ నిజం.. నాన్న నమ్మకం.. నవ మాసాలు మోసి తల్లి జన్మనిస్తే ...ఆ బిడ్డలను సాకి పెంచి పెద్ద చేయడానికి రెక్కలు ముక్కలు చేసుకుంటాడు తండ్రి. బిడ్డల కోసం తన సంతోషాలను త్యాగం చేసేది.. పిల్లల భవిష్యత్ కోసం పరితపించే వ్యక్తి నాన్నే.. బిడ్డలు ప్రయోజకులు అవుతుంటే తాను పడిన కష్టాలు మర్చిపోయి మురిసిపోయే నిస్వార్థజీవి. వంద మంది ఉపాధ్యాయులకు సమానమైన స్థాయి నాన్నది. అందుకే పితృదేవోభవ అంటారు. నేడు ఫాదర్స్‌డే సందర్భంగా పిల్లల ఉన్నతి కోసం తమ జీవితాలను ధారబోసిన తండ్రులపై ప్రత్యేక కథనం.

బిడ్డల ఎదుగుదలకు నిచ్చెన..


నలుగురు కుమారులతో సత్తయ్య దంపతులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి కార్మికుడు వెంబడి సత్తయ్యకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. అక్షర జ్ఞానం తెలియని వాడైనా కొడుకులను ఉన్నతంగా చదివించాలని ఆరాటపడ్డాడు. తండ్రి ఆశలకు అనుగుణంగా డిగ్రీలు చేసిన కుమారులు ఒక్కొక్కరుగా ఉద్యోగయత్నాలు చేశారు. పెద్దకుమారుడు రమేశ్ పోలీసుశాఖలో కానిస్టేబుల్, రెండో కుమారుడు భీమేశ్ ఎస్సై (ప్రస్తుతం సీఐ), మిగతా ఇద్దరు సురేష్, సంతోష్ సింగరేణిలో క్లర్క్‌లుగా పని చేస్తుండడంతో సత్తయ్య పడిన శ్రమ సత్ఫలితాలు ఇచ్చింది. భూగర్భంలో దిగి 39 ఏళ్ల పాటు సింగరేణిలో చెమట చిందించిన సత్తయ్య వచ్చిన డబ్బును దాచుకోకుండా బిడ్డల భవిష్యత్ కోసం ఖర్చుచేశాడు. కుమారులు ఉద్యోగాలు చేస్తుండటంతో ఆ తండ్రి సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.

ప్రయోజకుల్ని చేశాడు..


కుమారులతో దాసరి భూలింగు

కుంటాల: కుంటాలకు చెందిన రైతు దాసరి భూలింగు, గజ్జవ్వ దంపతులకు నలుగురు కుమారులు సంతానం. వారిని ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు రమేశ్ ఉపాధ్యాయుడిగా, రెండో కుమారుడు మహేందర్ మెదక్‌లోని బీవీఆర్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా, మూడో కుమారుడు ధనుంజయ్ ఎండీ, ఫిజీషియన్‌గా, చిన్నకుమారుడు రాజలింగు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కష్టపడి చదివించిన పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండడం ఎంతో సంతోషంగా ఉందని భూలింగు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ అందుకున్న దంపతులు


తైక్వాండో రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో నాగలక్ష్మి, సరీష్

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన కరాటే కోచ్‌లు మోకెనపల్లి నాగలక్ష్మి, సరీష్ దంపతులు తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాల నుంచి కరాటే కోచ్‌లు పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత


తిలక్‌నగర్‌లో పట్టుబడిన దేశీదారు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని తిలక్‌నగర్‌లో దేశీదారు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. తిలక్‌నగర్‌కు చెందిన యేనం రాజు వద్ద నుంచి సుమారు లక్షా 50 వేల రూపాయల విలువ గల మహారాష్ట్రకు చెందిన 3 వేల దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్సై సురేశ్, సిబ్బంది శ్రీనివాస్, మల్లేశ్, సతీశ్, స్రవంతి పాల్గొన్నారు.

సీఎండీకి రిటైర్డ్ ఉద్యోగుల వినతి


వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబురావు, ఉప ప్రధాన కార్యదర్శి ఏ.వేణుమాధవ్ మాట్లాడుతూ అరకొర పెన్షన్‌తో చాలామంది రిటైర్డ్ ఉద్యోగులు దినదిన గండంగా బతుకుతున్నారన్నారు. ఓయన్‌జీసీలో రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తున్నారని, సింగరేణిలో కూడా అమలు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బీరయ్య, వెంకటరమణ, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

చాకెపల్లిలో కిడ్నాపర్ అంటూ వదంతులు


మాట్లాడుతున్న సీఐ రవీందర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని చాకెపల్లిలో చిన్నారులను కిడ్నాప్ చేసేందుకు వచ్చాడన్న అనుమానంతో వ్యక్తికి దేహశుద్ధి చేసిన సంఘటన చోటు చేసుకుంది. చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ రవీందర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శనివారం చాకెపల్లిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గ్రామస్తులు పట్టుకుని 100కు కాల్‌చేశారు. పోలీసులు అతన్ని అరెస్టుచేసి విచారించగా అతని పేరు గోపి నాయక్ అని, తండ్రి పేరు కృష్ణ నాయక్ అని ఒడిశా నుండి మేషన్ పని నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. కొద్దిగా మతిస్థిమితం లేనట్టు ప్రవరిస్తున్నాడన్నారు. ఎక్కడినుంచో 18 మంది వచ్చారని సోషల్ మీడియాలో వస్తున్నది నిజం కాదన్నారు. ఇలాంటి వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

తెలంగాణ ధాన్యం ఏపీకి తరలింపు


లారీలో బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు

భీమారం: మండల కేంద్రంలోని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలోని గోదాంలో నిల్వ ఉన్న వరిధాన్యం బస్తాలను శనివారం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు లారీల్లో తరలించారు. ప్రభుత్వం వాటికి ఇటీవల టెండర్ నిర్వహించగా కేంద్రీయ బండార్ టెండర్ ద్వారా కొనుగోలు చేసింది. ఈమేరకు భీమారం గోదాంలో ఉన్న 1400 మెట్రిక్ టన్నుల ధాన్యంలో 500 మెట్రిక్ టన్నులు తూర్పుగోదావరి జిల్లాకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారుల సమక్షంలో లారీల్లో తరలిస్తున్నారు.

భూతగాదాలో 35 మందిపై కేసు

బెజ్జూర్: భూతగాదా కేసులో శనివారం 35 మందిపై కేసు నమోదు చేసినట్లు బెజ్జూర్ ఎస్సై విక్రం తెలిపారు. మండలంలోని మర్తడి శివారులోని సర్వే నెం .167/2, 167/3, 167/4, 167/5 లలో 48 ఎకరాల 30 గంటల భూమి ఉందని, ఆ భూమిని 2011లో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన గజ్జల శ్రీనివాస్, అతని సోదరులు 34 ఎకరాలు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అందులో నుంచి కొంత భూమి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కాలువల నిర్మాణాలలో పోగా, మిగతా 14 ఎకరాల భూమి ఉందని తెలిపారు. భూపాలపల్లికి చెందిన బిక్షపతి గౌడ్ అనే వ్యక్తి ఆ భూమిని తాను 2021లో కొనుగోలు చేశానని, తమకు కూడా భూమి ఉందని పేర్కొంటుండటంతో ఇరువర్గాల మధ్య భూతగాదాలు జరుగుతున్నాయన్నారు. గజ్జల సురేశ్, ఎండి ఇసాక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 35 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోణంపేట విద్యార్థినికి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు


నైతం శ్రావణి

నెన్నెల: బస్సు సౌకర్యం లేని మారుమూల గ్రామమైన కోణంపేటకు చెందిన గిరిజన విద్యార్థిని నైతం శ్రావణి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించింది. ఇటీవల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఎస్టీ కోటాలో ఆలిండియాలో 263వ ర్యాంకు సాధించింది. శనివారం నిర్వహించిన మొదటి రౌండ్ కౌన్సిలింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో సీటు దక్కింది.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం


కాలిన మంచం, బెడ్ సీట్లు

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శేక్ బాబుమియాకు చెందిన ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. ఫ్యాన్‌కు సంబంధించిన వైరులోంచి మంటలు చెలరేగడంతో ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. సుమారు రూ.60 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడిపై కేసు

భీమారం: సోషల్ మీడియాలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. జోడువాగుల బ్రిడ్జిపై తప్పులు ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టేవిధంగా రాజ్‌కుమార్ పోస్టులు పెట్టినట్లు కాంగ్రెస్ నాయకుడు షెడంరెడ్డి రమేశ్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట మహిళల ధర్నా


నినాదాలు చేస్తున్న మహిళలు

బెల్లంపల్లి: మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించి దుర్వాసన నుంచి కాపాడాలని బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామ మహిళలు శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని కుర్మ వాడలో మురికినీటి కాలువలు పూడిక తీతకు నోచుకోక పోవడంతో చెత్త చెదారం నిండి కంపు కొడుతున్నాయన్నారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కుభీర్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పీ.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన కొంగర్ల లక్ష్మణ్ (55)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తున్న వర్కర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లు శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానంద్ మాట్లాడుతూ హాస్టళ్లలో పనిచేసే కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్, నైట్ వాచ్‌మెన్, స్వీపర్, స్కావేంజర్‌కు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతిపత్రంలో కోరారు.

నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నెన్నెల: పదోన్నతులు కల్పించడంలో తీవ్ర అన్యాయం జరిగిందని నార్వాయిపేట ప్రాథమికోన్నత పాఠశాల ఎస్జీటీలు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి పాఠశాలకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు భీంపుత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌కు కావాల్సిన అర్హత ఉండి 20ఏళ్లకుపైగా ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఎస్జీటీలకు నష్టం జరుగుతుండడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఆలోచించి ఎస్‌జీటీలకు పదోన్నతుల్లో సమాన అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ గోడును విన్నవించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీలు సదయ్య, స్నేహలత పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

లక్సెట్టిపేట: మున్సిపల్ అభివృద్ధికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్నందువల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ కల్లెడ రాజశేఖర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాల పనులు ప్రారంభం

మండల కేంద్రంలో నూతనంగా చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కా భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనులను వేగవంతంగా నాణ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం నిర్మాణం మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మార్కెట్ కమిటీ సభ్యులు రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. చైర్మన్ దాసరి ప్రేంచంద్, వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, డైరెక్టర్లు గాండ్ల విజయ్‌కుమార్, కనక జంగు, కట్కూరి రాజన్న, గోపతి సునీత, తోట రమేశ్, పొలుసాని రవీందర్, బండ రాకేష్, బొప్పు వెంకటేష్, గంగుల వెంకటస్వామి, బుచ్చయ్య, బీరెల్లి రాజన్న, మల్యాల గణపతిస్వామిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అన్నం మంగ, దండెపల్లి ఎంపీపీ శ్రీనివాస్, మార్కెట్ ఏడీ గజానంద్, సెక్రటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'18న ధర్నా విజయవంతం చేయాలి'

కోటపల్లి: అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు ఆపాలని ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం కోరారు. శనివారం రొయ్యలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో హక్కుపత్రాలు వచ్చిన భూముల్నికూడా అటవీశాఖ అధికారులు దున్నుకోనివ్వడంలేదన్నారు. సమావేశంలో ముత్తయ్య, రాజేశ్, మల్లేశ్, సదవలి, పుష్పలత, మహేశ్వరి, మారయ్య, బాపు పాల్గొన్నారు.